ఇంటింటికీ సేవలకు మంగళం


కలిగిరి: జగనన్నఆరోగ్య సురక్షలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)


ఉదయగిరి: వింజమూరులోని విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం

- గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా గడప వద్దకే సేవలు
- వలంటీర్ల తొలగింపుతో ఇంటికి చేరని పింఛన్లు
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు
- ఎండీయూ వాహనాల తొలగింపుతో మొదలు కానున్న రేషన్ కష్టాలు
- ఫ్యామిలీ డాక్టర్ సేవలకు విరామం


ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బండ్లమూడి మాలకొండమ్మ. కొండాపురం మండలం కొమ్మి ఎస్సీకాలనీలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆమెకు గతంలో రేషన్ బండి ద్వారా ఇంటి వద్దకే సరుకులు అందేవి. రేపటి నెల నుంచి డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతుండడంతో సరుకులు సకాలంలో అందుతాయా.. లేదా.. తెచ్చి ఇచ్చేందుకు ఎవర్ని బతిమిలాడుకోవాలని ఆందోళన చెందుతోంది.


ఈ ఫొటోలో పూర్తిగా మంచానికే పరిమితమైన మహిళ పేరు షేక్ షాహీనా. ఆత్మకూరు పట్టణంలో నివాసం ఉంటోంది. గతంలో చిన్నపాటి అనారోగ్యానికి గురైనా తల్లిదండ్రులు ఆస్పత్రికి మోసుకెళ్లాల్సి వచ్చేది. గత ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడంతో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులు అందజేసేవారు. వలంటీర్లను అడిగినా మందులు ఇంటికి తెచ్చి ఇచ్చేవారని తల్లిదండ్రులు తెలిపారు. ప్రస్తుతం ఆ సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

ఉదయగిరి/ఆత్మకూరు : ప్రజాసంకల్పపాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకే అందించాలని సంకల్పించారు. ఇందు కోసం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. వీరి ద్వారా పింఛన్లు, ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు, కరోనా విపత్కర పరిస్థితుల్లో అత్యవసర సేవలు, మందులు ఇలా ఎన్నో సేవలను అందించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలను తీసుకొచ్చారు. వైద్యులు ఇంటింటిని సందర్శించి రోగులకు పరీక్షలు నిర్వహించి అసరమైన మందులు ఉచితంగా అందజేసేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు, ఆధార్ క్యాంపుల నిర్వహణ ద్వారా అనేక రకాల సేవలు సత్వరమే అందజేశారు. ఇదంతా గతం. నేడు అందుకు భిన్నమైన పరిస్థితి కూటమి ప్రభుత్వంలో కనిపిస్తోంది. వలంటీర్ వ్యవస్థపై కక్ష కట్టి తొలగించడంతో వేకువజామునే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇచ్చే పరిస్థితి మారింది. సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లోని కూడళ్లలో అందరిని కూర్చొబెట్టి ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. సర్టిఫికెట్లు తెచ్చి ఇచ్చే వారు లేక ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నజబ్బు చేసినా ప్రభుత్వ వైద్యశాలలకు వ్యయప్రయాసలకోర్చి పోవాల్సిందే. ఇలా కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఉదయగిరి నియోజకవర్గంలోని 78వేల కుటుంబాలు ఉన్నాయి. సుమారు మూడు లక్షల మంది జనాభా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు అవసరమైన అన్ని సేవలను కూడా 1200 మంది వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందజేసేవారు. కానీ నేడు ఆ వ్యవస్థ రద్దు కావడంతో దాదాపు ఇంటి వద్దకు అన్ని రకాల సేవలు బంద్ ఆయ్యాయి. కేవలం సామాజిక పింఛన్లు పంపిణీ సచివాలయ సిబ్బంది ద్వారా పాక్షికంగా అమలు జరుగుతోంది.పల్లెల్లో పేరుకు మాత్రమే 104 సేవలు అందిస్తున్నారు. గ్రామ కూడలిలో అరకొర సిబ్బంది ద్వారా వైద్యసేవలు అందజేస్తున్నారు. ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించే పరిస్థితి నేడు కనిపించడంలేదు. సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలకు మంగళం పాడారు. అధికారంలోకి వస్తే అన్నీ సేవలు గత ప్రభుత్వం కంటే మెరుగ్గా అందిస్తామని చెప్పిన చంద్రబాబు తీరా పీఠం ఎక్కిన తర్వాత ప్రజలకు పంగనామాలు పెడుతూ అన్ని సేవలకు మంగళం పాడుతున్నారు.

సర్టిఫికెట్ల కోసం తిరగాల్సి వస్తోంది


గత ప్రభుత్వ హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా వలంటీర్లే తెచ్చి ఇచ్చేవారు. గ్రామసచివాలయానికి వెళ్లినా వెంటనే ఇచ్చే వారు. ప్రస్తుతం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. రోజుల తరబడి తిరిగినా పని కావడం లేదు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలి.

–చుండి సుప్రియ, లక్ష్మీపురం

వలంటీర్లు లేక ఇబ్బందులు


గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా అన్ని రకాల సేవలు పొందాం. ఏ అవసరం వచ్చినా వలంటీర్‌కు చెబితే చేసి పెట్టేవాడు. ప్రస్తుతం వలంటీర్లు లేనందున ఏ చిన్న పని కావాలన్నా కార్యాలయాలు చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కూడా రోజులు తరబడి తిప్పుకుంటున్నారు. మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి.

–రావి మాల్యాద్రి,జలదంకి

వందకుపైగా సేవలు అందేవి


గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా వందకు పైగా పౌరసేవలు గడప వద్దకే అందేవి. వలంటీర్లను తొలగించడంతో సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రైతులకు రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ నగదు ఠంచనుగా పడేది. ప్రస్తుతం జగన్ కట్టిన రైతుభరోసా కేంద్రాల పేర్లు మార్చడం తప్ప కూటమి ప్రభుత్వం కొత్తగా సాధించిందేమిలేదు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలను రైతులకు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వానికి దిక్కులేదు.

–ఎం నరసింహులునాయుడు, రైతు, గండ్లవేడు గ్రామం, ఆత్మకూరు మండలం

పింఛన్ కోసం తిప్పకుంటున్నారు


నా భర్తకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఏడాది క్రితం ఆయన మృతి చెందారు. అప్పట్నుంచి పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా మంజూరు చేయడంలేదు. గతంలోనే పేరు మంజూరైందని, ఎన్నికలు రావడంతో ఆలస్యమైందని చెప్పిన అధికారులు ప్రస్తుతం ఇంకా సమయం పడుతుందంటున్నారు. ఎప్పటికి మంజూరవుతుందో దేవుడికే తెలియాలి.

–కల్లకూటి లక్ష్మీరాజమ్మ, మహ్మదాపురం

క్లుప్తంగా

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 437 బేళ్లను తీసుకురాగా, 348 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.243.53 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

డీసీపల్లిలో 472 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 472 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 510 బేళ్లు రాగా 472 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకుకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.250.52 ధర పలికిందని తెలిపారు.

పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

కావలి (జలదంకి): పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కావలి డివిజన్ రైతు సంఘాల కన్వీనర్ ఎం మాలకొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది పొగాకు బోర్డు 140 మిలియన్ల కిలోల పొగాకును పండించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రావడంలేదన్నారు. కిలోకు రూ.300 గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న పొగాకు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు.

ఆశీర్వచనం



ఉదయగిరి: పట్టణంలో గురువారం జరిగిన నల్లపోగు నాజర్ వివాహ వేడుకకు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఉదయం జరిగిన నలుగు వేడుకకు రాజగోపాల్‌రెడ్డి, మధ్యాహ్నం జరిగిన వివాహ వేడుకకు విక్రమ్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం, పెద్దకొండూరు, వెలగపాడు, అనంతపురం, క్రాకుటూరు, పోలంపాడు రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు. వెలగపాడు రైతుసేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు చెల్లించి తీసుకోవాలని కోరారు. వీఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి అంకురార్పణ

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి అంకురార్పణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ వాస్తు సిద్ధాంతి డాక్టర్ గోనుగుంటి బ్రహ్మానందశర్మ పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. వచ్చే నెల 5 లేదా 8వ తేదీన ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించాలని ముహూర్తం నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

హెచ్‌ఎంల బదిలీ

ఉదయగిరి: మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన ఐదుగురు ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు గురువారం తెలిపారు. అప్పసముద్రం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం విజయకుమార్ సిద్ధనకొండూరు, వెంగళరావునగర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నూర్జహాన్ ఉదయగిరి బీసీ కాలనీ ఉర్దూ పాఠశాల, కృష్ణంపల్లె జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శివరామిరెడ్డి మాముడూరు, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలకేశవులు బుచ్చిరెడ్డిపాళెం, గండిపాళెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు కాటేపల్లికి బదిలీ అయ్యారని వివరించారు. కాగా మండలానికి రెండో విడత పాఠ్యపుస్తకాలు సైతం పూర్తిస్థాయిలో వచ్చాయని తెలిపారు. పాఠశాలలు తెరవగానే విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

చౌకదుకాణాల్లోనే రేషన్ పంపిణీ

మర్రిపాడు/ఆత్మకూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లోనే నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు మర్రిపాడు తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్ స్వరూప్ తెలిపారు. గురువారం వారు మండల తహసీల్దార్ కార్యాలయాల్లో చౌకదుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి చౌకదుకాణాల్లోనే సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న ఆత్మకూరులో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడాన్ని నిరసిస్తూ వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూన్ 4న ఉదయం 10 గంటలకు ఆత్మకూరులోని ఎంజీఆర్ మెమోరియల్ మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి అధికారులకు వినతిపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అటవీ ప్రాంతాల సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న బృంద సభ్యులు

ఉదయగిరి: ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ బృందం గురువారం సందర్శించింది. ఉదయగిరి, ఆర్లపడియ, నందిపాడు, దుత్తలూరు, సీతారామపురం బీట్లను పరిశీలించారు. అనంతరం ఆయా బీట్లలో ఏ వృక్ష సంపద ఉంది?, వాటి ఎదుగుదల గతంలో కంటే ప్రస్తుతం ఎలా ఉంది? తదితర అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి బీఎస్ కుమార్‌రాజా, డీఆర్వో మురళి, ఎఫ్‌బీఓలు వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి, లక్ష్మీప్రసన్న, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి సారూ..

- నర్రవాడ బ్రహ్మోత్సవాల సమన్వయకమిటీ సమావేశం నేడు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వతేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశం నర్రవాడలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం జరగనుంది. ఏటా బ్రహ్మోత్సవాల్లో భక్తులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిపై సమన్వయకమిటీ సమావేశంలో అధికారులు చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రధాన సమస్యలు ఇవీ..

- ప్రత్యేక క్యూలైన్లు లేక వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.
- తాత్కాలిక మరుగుదొడ్లు లేక మహిళల బాధలు వర్ణనాతీతం.
- కొబ్బరికాయలు, ఎండు కొబ్బరి, ఇతర పూజ సామాగ్రి అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారుల చర్యలు శూన్యం.
- బ్రహ్మోత్సవాల సమయంలో ఏటా దొంగతనాలు జరుగుతున్నాయి.ప్రధానంగా క్యూలైన్లు, హోమగుండం వద్ద ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయి. అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- అన్నిటికంటే ప్రధాన సమస్య మద్యం అమ్మకాలు. బ్రహ్మోత్సవాల సమయంలో ఇష్టారీతిన మద్యం అమ్మకాలు సాగుతుండడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం విక్రయాలను పూర్తిగా కట్టడి చేయాలని భక్తులు కోరుతున్నారు.
- డైమండ్ డబ్బా వంటి జూదాలను నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని కోరుతున్నారు.
- లడ్డూ ప్రసాదంలో నాణ్యత పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాటాల తనిఖీ



వింజమూరు(ఉదయగిరి): మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపులకు చెందిన కాటాలను తూనికలు, కొలతల శాఖ అధికారి జాన్‌శ్యామ్‌సన్ గురువారం తనిఖీ చేశారు. జూన్ నుంచి రేషన్ సరుకులను డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్న నేపథ్యంలో కాటాలను తనిఖీ చేసి తేడాలు ఉంటే సరిచేసి సీల్ వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హమీద్ రేషన్ డీలర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. రేషన్ షాపులకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే సరుకులు అందజేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీ చేవూరు శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వెంగమాంబకు పల్లకిసేవ



దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబపేరంటాలు ఆలయంలో అమ్మవారికి పల్లకిసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేషాభిషేకాలు, చందనాలంకారం, పూజలు నిర్వహించారు.అనంతరం వెంగమాంబ, గురవయ్యనాయుడు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల నడుమ దేవస్థానం చుట్టూ ప్రదక్షణ గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఏఎస్‌పేట టీడీపీలో వర్గపోరు

అనుమసముద్రంపేట: మండల టీడీపీలో వర్గపోరు మొదలైంది. టీడీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు ఒక వర్గానికే మద్దతు తెలుపుతూ మహానాడుకు వెళ్లేందుకు మరో వర్గం వారికి బస్సులు కేటాయించకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను విస్మరించి కొత్తగా పార్టీలో చేరిన వారిని అందలం ఎక్కిస్తున్నారని విమర్శించారు. అనంతరం మహానాడుకు వెళ్లకుండా బాయ్‌కాట్ చేశారు. తెలుగు యువత నాయకులు కంచర్ల శ్రీధర్‌నాయుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వాకిచర్ల వీరప్రతాప్, మాజీ సర్పంచ్ భాజామియా, మైనార్టీ నాయకులు, పాల్గొన్నారు.

అనువైన రకాలను సాగు చేసుకోవాలి



అల్లూరు: ఖరీఫ్ సీజన్‌కు అనువైన పంట రకాలనే సాగు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్త ఎస్ లోకేశ్ బాబు మాట్లాడుతూ యువతను వ్యవసాయం వైపునకు ఆకర్షించడానికి ఆర్య ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. పంటలకు ఎరువులను శాస్త్రవేత్తల సూచనల మేరకు వాడుకోవాలని సూచించారు. డీఏపీని దుక్కిలోనే వాడుకోవాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలను వాడడం వలన పెట్టుబడులు తగ్గుతాయని తెలిపారు. ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏడీఏలు మారుతి దేవి, నాగరాజు, ఏఓలు వెంకటేశ్వర్లు, గీతాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



దుత్తలూరు: వెంకటంపేటలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అష్టోత్తర కలశస్థాపన, పుణ్యాహవచనం, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నూతన విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

కుట్టుశిక్షణా కేంద్రం తనిఖీ

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎంపీడీఓ అప్పాజీ గురువారం తనిఖీ చేశారు. శిక్షణా కేంద్రం నిర్వాహకులు, శిక్షకులకు సూచనలు చేశారు. మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 80శాతం హాజరుతో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కుట్టుమెషీన్లు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట జూనియర్ సహాయకులు సమద్, నిర్వాహకురాలు నజియా తాజూన్, శిక్షకురాలు పద్మ ఉన్నారు.

జక్కా వెంకయ్యకు నివాళి


ఉదయగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి రూరల్: సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. నాయకులు కోడె రమణయ్య, ఫరిద్దీన్‌బాషా, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాయబ్, కామాక్షమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: కావలి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. కావలిలోని శివరామసుబ్బయ్య భవనంలో, జలదంకిలోని సురె చెంచురెడ్డి భవనంలో, బ్రాహ్మణక్రాకలోని సీపీఎం కార్యాలయంలో జక్కా వెంకయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, జలదంకి గ్రామ కార్యదర్శి రావి మాల్యాద్రి, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ గడ్డం మాల్యాద్రిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దగదర్తి: మండలంలోని అనంతవరం,దగదర్తి, నారాయణపురం, దామవరం పంచాయతీల్లోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి గోపసాని రమేష్, చల్లా మాల్యాద్రి, పెరికల మాల్యాద్రి మంద మహేష్, ఒంటేరు సుధాకర్, గొల్లపల్లి వెంకటరమణ, గోపసాని మధు, రవి, సీనయ్య, గురజాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



సోమశిల: సీపీఎం నాయకుడు జక్కా వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని అనంతసాగరంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో 174 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేయించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా తెలిపారు. తొలుత జక్కా వెంకయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళ పుల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శాంతి స్వరూపిణిగా వింధ్య పరమేశ్వరి



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు కొండపై కొలువైన వింధ్య పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శాంతి స్వరూపిణిగా దర్శనమిచ్చింది . ఉదయం అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఆటోను ఢీకొన్న మినీలారీ

- నలుగురికి స్వల్ప గాయాలు


ఆటోపైకి దూసుకెళ్లిన ఐషర్ వాహనం

దగదర్తి: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఆటోను మినీలారీ అదుపుతప్పి ఢీకొన్న ఘటన మండలంలోని ఉలవపాళ్ల వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలు..జాతీయ రహదారిపై మార్జిన్ లైన్లు వేసేందుకు సంబంధిత సామగ్రిని తీసుకుని హైవే సిబ్బంది కావలి నుంచి నెల్లూరు వైపు ఐషర్ మినీలారీలో బయలుదేరారు. అల్లూరు క్రాస్ రోడ్ వద్దకు రాగానే మినీలారీ అదుపుతప్పి అల్లూరు వైపు వెళ్లేందుకు బస్‌షెల్టర్ వద్ద ఆగి ఉన్న ఆటోపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐషర్ వాహనం డ్రైవర్, అందులోని ముగ్గురు సిబ్బందితో పాటు ఆటో డ్రైవర్ ఫయాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే మొబైల్ పోలీసులు, దగదర్తి పోలీసులు ఆటోను పక్కకు తొలగించి క్షతగాత్రులను హైవేఅంబులెన్స్‌లో కావలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.